చేస్తాను' అంటూ తొందరపడతాడు. ఆ సైన్యాన్నీ, కోలాహలాన్నీ చూసిన ఎవరికైనా అనుమానం కోపం రావడం సహజం. కానీ అక్కడ ఉన్నది రాముడు. అందుకే 'అన్నదమ్ములను చంపి తీసుకునే రాజ్యం నాకు విషంతో సమానం. ఒకవేళ నేను రాజ్యాన్నే కోరుకుంటే, అది మీ అందరితో కలిసి ఉండటానికే. అయినా భరతుడి గురించి మనకు తెలియదా! మనం వనవాసం చేస్తున్నామని తెలిసి, తనతో పాటు తీసుకువెళ్లడానికే వస్తున్నాడేమో!' అంటూ లక్ష్మణుడి అనుమానానికి అడ్డుకట్ట వేస్తాడు. తను ఊహించినట్టుగానే క్షేమం కోరి వచ్చిన భరతుడికి పాలనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ చెప్పి పంపిస్తాడు.

**క్షణంలో... గురి తప్పని అంచనా!**


రామ-హనుమల మధ్య సఖ్యత గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే. కానీ దానికి బీజం ఎలా పడిందో తెలిస్తే ఆశ్చర్యం కలగక మానదు. సీతమ్మను వెతుక్కుంటూ కిష్కింధలో అడుగుపెట్టిన రామలక్ష్మణులను చూసి, వారి చెంతకు వెళ్తాడు హనుమంతుడు. సుగ్రీవుడి రాయబారిగా తనను తాను పరిచయం చేసుకుంటూ వారి పరిచయాన్ని కోరతాడు. హనుమను చూసిన ఆ క్షణంలోనే తనను అద్భుతంగా అంచనా వేస్తాడు రాముడు. ఆ కాస్త సంభాషణలోనే 'హనుమంతుడు నాలుగువేదాలు చదివిన జ్ఞాని కాబట్టే తన వ్యాకరణంలో కానీ, ఉచ్చారణలో కానీ ఎలాంటి అపశ్రుతి దొర్లలేదని. తన కనుబొమలు, నుదురు మొదలుకొని శరీరంలోని ఏ అవయవంలోనూ దోషం కనిపించడం లేదు. తన వాక్యాలు మరీ సుదీర్ఘంగా కానీ, అలాగని అసంపూర్ణంగా కానీ లేవు. స్వరం మరీ హెచ్చుగానో, గొణుగుతున్నట్టుగానో కాకుండా మధ్యస్థంగా ఉంది. ఉచ్చారణలో తొందరపాటు లేదు.' అంటూ పలురకాలుగా హనుమను అంచనా వేస్తాడు. ఒక నాయకుడికి ఉండాల్సిన లక్షణమిదే. అవతలి వ్యక్తి ఎలాంటి వాడు, ఎందులో సమర్థుడు, తన బలాబలాలు ఏమిటి, తనను ఏ విధంగా వినియోగించుకోవచ్చు, ఎంతవరకు నమ్మవచ్చు అంటూ ఒకే ఒక్క సంబాషణతో, సందర్భంతో అంచనా వేయగలగాలి. ఆ లక్షణం రాముడిలో అడుగడుగునా కనిపిస్తుంది.



**నీరంత మృదువు... ఉప్పెనంత కఠినం!**

రాముడు మృదుస్వభావి. ఒక్క మాట కూడా పరుషంగా మాట్లాడని మర్యాదాపురుషోత్తముడు. శత్రువును సైతం గౌరవించేవాడు. లోకం ఇలాంటి లక్షణాలను బలహీనతగా భావిస్తుందని తనకు తెలుసు. మారీచసుబాహులతో పాటుగా వేల మంది రాక్షసులను కూల్చినా, శివధనుస్సును విరిచినా, సకల అస్త్రశస్త్రాల మీద పట్టు సాధించినా... వాటిని లోకం విస్మరిస్తుందని తనకు ఎరుకే! కానీ ఒకరిని భయపెట్టేందుకు తన పరాక్రమంతో అహంకరించలేదు. అవసరమైనప్పుడు కోపాన్నీ, బలాన్నీ దాచలేదు. సీతమ్మ జాడ కానరానప్పుడు 'నా సీత దక్కకపోతే ముల్లోకాలలోనూ ప్రళయం సృష్టిస్తాను. నా మృదు స్వభావాన్ని బలహీనతగా భావించేవారికి నా పరాక్రమం చూపిస్తాన'ని గర్జిస్తాడు. ఆ సమయంలో ప్రళయకాల రుద్రుడిలా ఉన్న రాముడిని చూసి లక్ష్మణుడే భయపడిపోయాడట. మరో సందర్భంలో రాముడి సాయంతో వాలిని వధించిన సుగ్రీవుడు, సీతమ్మను వెతికేందుకు సాయపడతానని చెబుతాడు కానీ... రాజభోగాల మధ్య ఇచ్చిన మాట మర్చిపోతాడు. సుగ్రీవుడికి కర్తవ్యాన్ని గుర్తుచేసేందుకు రాముడి పనుపున లక్ష్మణుడు వెళ్తాడు. 'యుద్ధంలో నేను విల్లును లాగి వదిలే శబ్దాన్ని వినాలనుకోవద్దు; వాలి వెళ్లిన మార్గం ఇంకా మూసుకోలేదు, నువ్వు కూడా అదే మార్గంలోకి వెళ్లాలని ప్రయత్నించకు; ధర్మం తప్పాడని వాలిని ఒక్కడినే చంపాను. కానీ, ఇచ్చిన మాట తప్పితే నీ బంధువులు సహా నిన్ను వధిస్తాను' అంటూ హెచ్చరికలను జారీచేస్తాడు. ఇక రామరావణ యుద్ధ సమయంలో తన పరాక్రమం గురించి ఏం చెప్పగలం!

## సీతమ్మ అసామాన్యురాలు..



**చాలామంది** సీత అనే పేరే పెట్టుకోవడానికి ఆలోచిస్తారు. ఆ పేరుతో తనలాంటి కష్టాలే వస్తాయని అనుకుంటారు. కానీ కాస్త జాగ్రత్తగా గమనిస్తే... తనలో అసమాన ధీరత్వం కనిపిస్తుంది. అసలు రావణుడి మీద పగ తీర్చుకోవడానికే తను జన్మించిందనీ, తను లేనిదే రామాయణం లేదనీ చాలామంది వాదన. ఆ పూర్వ వృత్తాంతాలను పక్కన పెట్టినా, తను లేనిదే రావణసంహారం లేదు కదా! కోటలోనే ఉండే అవకాశం ఉన్నా... కష్టాలలో తన సహచరుడికి అండగా ఉండేందుకు అడవి ఒడిలో అడుగుపెట్టింది. గీత దాటితే కష్టం రావచ్చని తెలిసినా... దాని పర్యవసానాలకు సిద్ధపడే తెగువ తనది. ముల్లోకాలను గడగడలాడించే రావణుడు తన ఎదుట నిలిస్తే... గడ్డిపోచ చూపించిన ధైర్యం తనది. లంకకు చేరిన హనుమంతుడితో తిరిగి వెళ్లే అవకాశం ఉన్నా, తన భర్తనే వచ్చి తీసుకువెళ్లమని చెప్పిన అభిమానవంతురాలు. ఇంతచేసినా తిరిగి తనను అడవులపాలు చేసినప్పుడు కుంగిపోలేదు సరికదా, తన కొడుకులను రాముడినే ఎదిరించేంత వీరులుగా తీర్చిదిద్దింది. ఆ పిల్లలు తనవాళ్లే అని తెలిసిన రాముడు అయోధ్యకు తిరిగి రమ్మన్నప్పుడు, కాదనగల ఆత్మాభిమానం ఆమె సొంతం. అంతదాకా ఎందుకు? శివ ధనుస్సు ఎత్తగల ధీరురాలు అని గ్రహించే కదా, జనకుడు అదే ధనుస్సును ఎక్కపెట్టమంటూ స్వయంవరంలో సవాలు విసిరింది?

